# గుడ్డివాడు

"రంగంపేట్లో గంగమ్మ జాతర, ఆ రంగ రంగ వైభోగవే వైభోగం. కోలాటాలేనా, పలకల దరువులేనా, ఏలపదాలేనా, రకరకాల వేశాలుగట్టేవాళ్లేనా, తిరుగు మరుగు లేకుండా వాళ్ల గొంతెత్తి పాడే బూతు పాట్లేనా, అరమరికలు లేకుండా ఆడా మొగా తేడా లేకుండా ఆ బూతు పాట్లింటా వొళ్లు మర్చిన అమాయకుల నడమన ఆ ఆనందవే ఆనందం! ఆ అనుభోగవే అనుభోగం! ఆ అనుభూతే అనుభూతి! అనడానికి మాలదు అనుభోగించి తీరాల్సిందే" అని వాళ్ళూ, వీళ్లూ అంటూ వుంటే విన్నాను.

నాలో నేను నవ్వుకొన్నాను..! ఆ ఎందుకంటే, నా చిన్నప్పుడు మా అమ్మ "ఒరే అబ్బోడా! ఈ ఎండలు గాసే భూమండలంలో జా ఒటే తిరపతి గంగమ్మ జాతరేరా! అటువంటి జాతర్ను యింకేడా మూళ్లేము. మూడబోము. మంగళారంతో మొదులుబెట్టి మళ్లా మంగళారంతో ఆకిరైపొయ్యే ఆ జాతర వైభోగాన్ని ఏడు కొండలో డటుమంటోడే మక్కాం పర్వతం మింది కొచ్చి గాలి గోపరం కాడ కూసోని కన్నట్టార్ప కుండా మాస్తాడంట" అని అంటా వుంటే ఆ మాటలు బాగా నా గుండెల్లో నాటుకొని పోయినాయి.

అయితే, తిరుపతి గంగమ్మకు ఈ నాగరీకుల మధ్యలో గత వైభవ స్మృతులు మాత్రమే మిగిలినట్లుంది. జాతర కళలు కళ తప్పుతున్నాయి. ఆ తలపోతల్లోనే ఆమె 'ఆహా ఓడలు బండ్లయినాయి గదా?' అని విచారపడ్తా వుంటే రంగంపేట గంగమ్మ కథ రంగరంగ వైభోగంగా వున్నట్టుంది.

అందుకే వెళ్ళి చూడాలనుకొన్నాను.

అయితే, నిజానికి నేను చూడాలనుకొంది గంగమ్మ జాతర వైభవాలు కాదు. ఆ కోలాటం పాటల్లో ... ఆ ఏల పదాల్లో ... ఆ బూతు పాటల్లో అప్రయత్నంగా దొరలే అందమైన అచ్చ తెనుగు పదాలను వినాలనిపించింది. సగం తెలుగుగా సగం ఆంగ్లంగా కలగలిపి ఈ తెలుగు భాషను ఉద్ధరిస్తున్నామని మాట్లాడే ఈ కృత్రిమ తెలుగు విని విని తుప్పు పట్టిన చెవులకు అదొక గొప్ప అనుభూతి. అందుకే రంగంపేట గంగమ్మ జాతరకు బయల్దేరు తున్నాను.

"ఎక్కడికి?"

ఉరుము ఉరిమినట్లు ... పిడుగు సరాసరి నెత్తినపడినట్టు మాట చెవుల్లో పడేసరికి ఉలిక్కిపడినాను. తల పైకెత్తినాను. ఎదురుగా శ్రీమతి. నా మతి పొయ్యేటట్టుగా నా వైపు ఉరిమి ఉరిమి చూస్తా వుంది.

నా నోటంట మాట రాలేదు.

"ఈ కొంపలో మొగోడికి యిపరీతపు బుద్ధులున్నట్టే ఈ తిరపతిలో ఎండలుగాసేది కూడా యిపరీతంగానే వుండాది. ఎట్టుండాది ఎండ? పెంద్ర నిప్పల్ను కాటల్తో ఎత్తి యిదుల్లో పెరిగిపోసినట్టుండాదే? యాడ కొంపలంటుకపోతా వుండాయో? యాడ కొండల్ను పిండి గొట్టాల్నో? ఈ ఎండలో ఎలబార్తా వుండాదు గదమ్మా యీ యింట్లో మొగోడు?"

ఇంటి గోడవైపు చూస్తా ఆ గోడతో మొరబెట్టుకొంటున్నట్లుంది మా శ్రీమతి — ఉద్దేశించింది నన్నయితే కూడా.

"ఒసే నా వయ్యారి భామా! నా వలపుల గిలకా! నా పిలకల కొలికీ! వేలెడంత పిల్లల్ని చూస్తే మమ్మీ! డాడీ! అనడం తప్పిస్తే హాయిగా అమ్మా నాన్నా అని పిలిచే స్థితి ఎప్పుడో దాటి పోయింది. కాలక్షేపానికి కథా కమామిషో చదువుకుందామని ఏదైనా ఒక పత్రిక చేతి కెత్తుకుంటే అది తెలుగో ఆంగ్లమో అర్థం కాని మొత్తుకోళ్లు. రంగంపేటలో గంగమ్మ జాతరంట. రంగ రంగ వైభోగంగా ..... ... ... ... జరుగుతుందట. ఆ కోలాటం పాటల్లో ... ... ... ... ... ... ఆ ఏల పదాల్లో ... ఆ బూతు పాటల్లో మరుగున పడిపోతా వుండే మంచి తెలుగు పదాలను ఏరి తెచ్చుకుంటావే!" అని అంటే ఆ తల తిక్కమనిషికి తలకెక్కుతుందా? నాకు నమ్మకం లేదు. తల కెక్కక పోగా పక్కింటి పార్వతమ్మనో, ఎదురింటి అన్నపూర్ణమ్మనో పిలిపించి " మా యింట్లో భాషా సేవకుడు ఎలబార్తా వుండాడమ్మా. రండి రండి! ఒకరి కిద్దరు ముత్తయిదులు ఎదురుంగా రండి. ముత్తయిదు సగినం మంచి సగినం గదా?" అని ఎగతాళి పట్టించినా పట్టిస్తుంది.

ఆ మాట అననేల? దానికి రెండు రానేల? కొంచెం సేపు చెవులు వినపడవు. కండ్లు కనపడవు - అని అనుకొంటే సరిపోతుందని నా ప్రయత్నం నాదిగా నేను బయలుదేరు తున్నాను.

"అయితే పోతా వుండావు గదా? పోపో! అప్పటికి నువ్వెందుకు పోతా వుండావో నాకు తెల్దనుకున్నావా? ఆ జాతర సాకు బెట్టి రంగంపేట కొచ్చే యిద్దేసిన ముండమోపుల్ను చూడాలని గదా నీ మనాస! అయినా బిడ్లకు బిడ్లయినారు గదా? ఇంకా ఎందుకే నీకీ పాడు బుద్ధి?"

అదీ ఆడదాని బుద్ధి! ఏమని బదులు చెప్పగలం?

మాటకు మాటతో మనస్సులు బాధపడడం తప్ప ప్రయోజనం వుండదు. అందుకే ఆమె మాటల్ని ఈ చెవుతో విన్నట్టు విన్నాను. ఆ చెవుతో వదిలిపెట్టినాను. నేను యిల్లు విడిచి బయటపడినాను.

మా శ్రీమతి అనిన మాట నిజమే!

పొద్దు బాగా నడమటి వైపుకు వాలిపోయినా ఎండ చెంద్ర నిప్పుల్ని చేటలకెత్తి చెరిగిపోసినట్లే వుంది. వడగాడ్పులు గూబల్ని అదరగొడ్తున్నాయ్. సాధారణంగా ఆ వేళప్పటికి జన ప్రవాహంతో ఊపిరి సలుపుకోలేని వీథులు ఊసురోమంటు న్నాయి. ఆ వడ గాల్పులు దెబ్బంతా నా వొక్కడి పరమయ్యేటప్పటికి అడుగు తీసి అడుగు పెట్టడం కష్ట సాధ్యంగా వుంది. ఆ స్థితిలో మా తలతిక్క మనిషి మాటలు బాగా తలకెక్కుతున్నాయి. మాటలే కఠినం. మనసు వెన్న. తన భర్త ఈ ఎండ వాత పడడం ఆమెకు యిష్టం లేదు. ఆ అయిష్టత నిష్ఠురోక్తులైనాయి. ఆ నిష్ఠూరంలో నిగూఢంగా ఎంతటి

పులికంటి కృష్ణారెడ్డి

ఆత్మీయత? మరెంత ఆవేదన?


బయలుదేరుతుంటే ఆమె పడిన మథనలోని ఆంతర్యం అర్థమయ్యే సరికి ఆలోచనలు ఎటెటో పోతున్నాయి. ఎండలో నడుస్తున్నామన్న మాటే మరిచినాము. బహుశా ఆలూమగల మధ్య నిష్ఠురోక్తుల్లో అంతర్లీనమైన ఈ ఆత్మీయతే సంసారాలు సాఫీగా సాగడానికి దోహదం చేస్తున్నది. లేకపోతే దినానికి ఎన్ని విడాకులో? ఏమో?

బస్టాండు చేరుకొన్నాము.

బస్సులు వస్తున్నాయి. పోతున్నాయి. వచ్చిన బస్సుల్లో నుండి దిగిన జనం ఎటు పోవాలో ఏమో దిక్కు తోచనట్లుగా దిక్కులు చూస్తూ నిలబడుకొంటున్నారు. బయలుదేరిపోతున్న బస్సుల్లో చోటు దొరకక నిలబడిపోయినవాళ్ళ దిక్కులు చూస్తున్నారు. ఎర్ర బస్సులు మాత్రం ఎవరినీ లక్ష్య పెట్టకుండా 'మీ దిక్కున్న చోటుకుపోయి చెప్పుకోండి' అన్నట్టుగా దిక్కుకొకటి పరుగెత్తుతున్నాయి.

రంగంపేట జాతర కళ తిరుపతి బస్టాండులోనే కనిపిస్తూ వుంది.

నా శక్తినంతా కూడగట్టుకొని ఆ జనారణ్యాన్ని ఛేదించుకొని భీమవరం బస్సెక్కినాము. నా మాదిరి కొంతమంది మగవాళ్ళు, ఆ మగవాళ్లకు రెండంతలుగా




ఆడవాళ్ళు పోటీ పడుతూ ఎక్కినారు.

నెక్కి తోసేస్తూ ... పక్కకు నెట్టేస్తూ ... అవసరమైతే యీడ్చి అవతల పారేస్తూ భీమవరం బస్సెక్కిన ఆడవాండ్లను మనసారా అభినందించినాము. ఈ తెగువ ఈ సాహసం స్త్రీ జాతి అవసరమైన చోట ప్రదర్శించగలిగితే ఈ దేశ స్వరూప స్వభావాలు ఎంతగా మారిపోవునో? అని ఆలోచిస్తూ వుంటే బస్సు బయలుదేరింది.

బ్రతుకు జీవుడా! అనుకున్నాము. ఎందుకంటే? ఎండన పడి రావడం ... నన్ని రావడంతోటే జనం సందున యిరుక్కొని పోవడం ... గాలి ఆడడం లేదు. విపరీతంగా ఉక్కపోస్తూ వుంది. చొక్కా చెమటతో తడిసి ముద్దయింది. ఆ పరిస్థితి అట్లానే మరికొంత సేపు కొనసాగితే నా గతి ఏమయ్యేదో! బస్సు కదిలింది. గాలి ఆడుతూ వుంది. ఒంటి కాలి మీద బ్రతుకైనా యిక ఫరవాలేదులే! అని ఊపిరి పీల్చుకొన్నాము. అయితే, బస్సులో నన్ను ముట్టుముట్టిన వొక్కొక్క ఒంటి మీద నుండి ఒక్కొక్క రకం వాసన ... రకరకాల వాసనలు కలగలిసే సరికి అదొక చిత్రమైన వాసనగా తయారయింది. భరించడం కష్ట సాధ్యంగా వుంది. ఏం చేయాల్రా భగవంతుడా అని ఆలోచిస్తున్నాము.

బస్సు కృష్ణాపురం ఠాణా దాటింది. టౌన్ క్లబ్ దాటింది. బాలాజీ కాలనీ సమీపాన పోతూ వుంది. ఆ ఎర్ర బస్సు ఏ కాలం నాటిదో? ఏం పాడో? ప్రజా సేవా కర్తవ్యంలో పండిపోయిన నన్ను యింకా ఎందుకు చంపుక తింటున్నారన్నట్లుగా ఎగిరెగిరి పడుతూ వుంది.

"టికెట్ సార్! టిక్కెట్ ప్లీజ్"

అంటూ కండక్టర్ అడిగి అడిగి టిక్కెట్లు యిస్తున్నాడు. అతడు మనుష్యుల మధ్య దూరడం గమనిస్తూ వుంటే అతగాడి ఒంటిలో ఎముకలున్నాయా? లేవా? అన్న సందేహం కలుగుతూ వుంది. ఒంటి కాలి మీద నిలబడిన నేను జేబులో చెయ్యి పెట్టి డబ్బు తీసి టికెట్టు కొనాలి. అది సాధ్య పడే పనేనా?

"సార్!"

బస్సులో ఎవరో ఎవరినో పిలుస్తున్న పిలుపు నా చెవిని పడింది. నిజానికి కిక్కిరిసిన బస్సులో నా చావు నాదిగా వుంది. కాలు కదలడానికి లేదు. చెయ్యి తిరగడానికి లేదు. టిక్కెట్టు కొనడం తక్షణ సమస్య. ఆ సమస్యా పరిష్కారానికి నా తంటాలు నేను పడుతున్నాము. అంతలోనే "మిమ్మల్నే సార్" అన్న పిలుపుతో కూడా నా చేతిని యింకొక చెయ్యి తాకుతూ వుంది.

చాల కష్టపడి మెడను స్వాధీనంలోనికి తెచ్చుకుని జనం సందుల్లో నుండి వచ్చిన చేతి మీదుగా దృష్టిని సారించినాము. ఆ బస్సులో కిటికీ పక్కన కూర్చొని నా వైపే నిక్కి నిక్కి చూస్తున్నాడొక పిల్లవాడు.

నత్తుగా ఉంగరాలు తిరిగిన జుట్టు... నిర్భడీ నిర్భడని మీసకట్టు...కాంతివంతమైన కండ్లు...చక్కని పలువరస...పద హైదు పదహారేండ్లు వుండవచ్చునేమో! ముద్దముచ్చటగా వున్నాడా పిల్లవాడు.

'ఏం?' అన్నట్టుగా అతడి వైపు చూసినాము.

"మొన్న టీవీలో ప్రోగ్రాం ఇచ్చింది మీరేగదసార్?"

"ఎందుకయ్యా?"

"అవునా...కాదా...అని!"

"నేనేనయ్యా!"

ఆ మాట చెవినిపడేసరికి అతడి మొగం ఎందుకు ఆనందం తొణికిస లాడింది. కన్నులు మిలమిల మెరుస్తున్నాయి. పెదవుల మీద చిరునవ్వుల పువ్వులు పూసినాయి. ఆ పిల్లవాడు పైకి లేస్తూ "మీరు కూర్చోండి సార్" అన్నాడు.

"ఫరవాలేదు లేవయ్యా!"


"మీరు పెద్దవారు. కూర్చోండి సార్" అంటూ నా మాట వినిపించు కోకుండా జనం మధ్య దూరి నా దగ్గరికి వచ్చే ప్రయత్నంలో వున్నాడు. అతని వాలకం చూస్తే వద్దన్నా వినేటట్టుగా

లేదు.

ఇప్పుడు కిటికీ పక్కన సీటు. హాయిగా వుంది. ఒకరు యిస్తే అనుభవించే సుఖం స్వర్గమైతే ఆ స్వర్గ సుఖం నాకు దక్కింది. ఈ దేశంలో కళాకారులకు బస్సులో సీటేగాదు, రాజ్య సింహాసనాలు కూడా సులభంగానే దక్కుతున్నాయి. కళాకారులూ జిందాబాద్!

బస్సు పేరూరు దాటింది. పెరుమాళ్ళపల్లిని దాటింది. కాలూరు దగ్గర ఎవరో చెయ్యి అడ్డం పెట్టినా సద్దు చెయ్యకుండా స్వర్ణముఖి నదిని దాటుతూ వుంది. ఆ నదిలో అగస్త్యేశ్వర దేవాలయం. ఒంటికాలిమీద నిలబడి అంతవరకు ఆ బస్సులో చేసిన తపఃఫలితంగా అగస్త్యేశ్వరుడు దర్శనమిచ్చినట్లుగా జనం ఆ దేవుడికి దండాలు పెడుతున్నారు బస్సులో నిలబడే.

నేను రంగంపేట జాతర వైభవాన్ని ఊహిస్తూ కూర్చున్నాను.




బస్సు ఆగుతూ ఆగిన చోట కొంత మందిని దింపి మరికొంత మందిని ఎక్కించుకుంటూ పన్నెండు కిలో మీటర్ల దూరాన వున్న చంద్రగిరిని చేరడానికి గంట కాలం పట్టింది. ఈ దేశంలో ప్రజల ఓపిక మెచ్చుకో తగింది.

ఆ డొక్కు బస్సు డ్రైవర్ ఓపికను కూడా పరీక్షించినట్లుంది. చంద్రగిరిలో బాట ప్రక్కగా అతడా బస్సును నిలబెట్టి అక్కడొక టీ అంగడి మీద పడినాడు.

అక్కడొక వయ్యారి భామ టీ కలుపుతూ వుంది. ఆ అందాల బొమ్మ చేతినుండి టీ అందుకున్నాడు. టీ గుటక లేస్తూ కండ్లతో ఆమె అందాన్నితాగుతూ మధ్య మధ్య నంజుకుంటున్నట్టుగా ఛలోక్తులు విసురుతున్నాడు. ఆ భామ ఒక మాదిరి చూస్తూ యింకొక మాదిర నవ్వుతూ వుంది. డ్రైవర్‌తో కలిసి టీ తాగడానికి వెళ్ళిన వాళ్ళు ఆ ఉచిత ప్రదర్శనతో ఉబ్బి తబ్బిబ్బవుతున్నారు.

బస్సు పలచబడింది.

పలచ బడిన బస్సు...వయ్యారి భామ చేతి టీ సేవించిన డ్రైవర్...బస్సు హుషారు మీద వుంది. మరొక అర్థ గంటలో రంగంపేటలో దిగవచ్చు. అప్పటికి దాదాపుగా పొద్దుగూట్లో పడుతుంది. పొద్దు గూట్లో పడిందంటే యింకేముంది? జాతర ప్రారంభమైనట్లే! జాతర ఊహల్లో మనము రంగంపేటలో. కట్టె కదులుతున్న బస్సులో!

ఉన్నట్లుండి శ్రావ్యమైన పాట...ఆ పాటకు లయగా ఢక్క దరువు చెవిని పడింది. రంగంపేట జాతర ఊహలకు రెక్కలొస్తే కండ్లు బస్సులో కలయ చూస్తున్నాయి.

గోగుదంటులా సన్నగా...పొడుగ్గా... పాత చింతపండు రంగునే మరపించేటట్లుగా మాసిన గుడ్డ...గడ్డంతో దిష్టి బొమ్మలా వున్నాడు. అయితే ఆ కంఠంలో మాధుర్యముంది. చేతిలో లయ వుంది. శ్రావ్యంగా పాడుకొంటూ పాటకు అనుగుణంగా ఢక్కు వాయిస్తున్నాడు. నా దృష్టి అటు యిటు కదలకుండా అతడి మీదనే నిలబడింది.

కాలూ చెయ్యి సక్రమంగా వున్నా ఆ

దీపావళి శుభాకాంక్షలు



శ్రీ సప్తగిరి
ఐరన్ స్టీల్ సిండికేట్
& బిల్డింగ్ మెటీరియల్స్
జాఫ్రీరోడ్, యూనియన్ బ్యాంక్ ప్రక్కన-కరీంనగర్
ఆథరైజ్డ్ డీలర్స్: ఓరియంట్, గ్రే సిమెంట్
మీ భవన నిర్మాణమునకు కావలసిన సమస్తము లభించును

సప్తగిరి శానిటరీ ఏజన్సీస్
ఆథరైజ్డ్ డీలర్: ప్యారీ శానిటరీ వేర్
మా వద్ద
కేరాఫ్లోరింగ్ టైల్స్, రామ్‌కో సిమెంట్ రేకులు, యూనివేర్ శానిటరీ, జాన్సన్ గ్లేజ్‌డ్ టైల్స్
మరియు అన్ని రకముల భవననిర్మాణ సామానులు లభించును.

ఆకారానికి రెండు కండ్లూ లేవు.

పాడుతున్న ఏదో సినిమా పాట పూర్తయింది.

"గుడ్డోణ్ణి! ఒక ధరమం సెయ్యండి సాములాలా!" అని అడుక్కుంటున్నాడు. సాధారణంగా యిటువంటి జనాన్ని రైళ్ళలో చూస్తూ వుంటాం. వీళ్ళు బస్సులకు కూడా దిగుమతి అయినారే? నా సందేహాన్ని వ్యక్తం చేస్తే- ప్రక్కనున్న వ్యక్తి "వాడు టిక్కట్టు కొనుక్కునే ప్రయాణం చేస్తాడు సార్" అన్నాడు.

అతడి మీద నాకు గౌరవం కలిగింది.

"కన్నుల్లేని కబోదోణ్ణి సాములాలా!... మీరు నమిలి పారేసే ఆకూ వక్క... తాగి పారేసే సిగరెట్టు ముక్క...ఒక పూట తమని కాదనుకుంటే మీ బిడ్డల్లో ఒక బిడ్డ...రొండు కండ్లూ లేని కబోదోడు...బతికిపోతాడు సాములాలా!" అని అభ్యర్థిస్తున్నాడు.

నా బుర్రలో రకరకాల ఆలోచనలు.

ఆకాశవాణి...జానపద విభాగానికి అతడిని పరిచయం చేస్తే? ఇప్పుడు వింటున్న గొంతుకల కేమీ తీసిపోదు. ఒక గుడ్డివాడికి బ్రతుకు తెరువు చూపినట్లుంటుంది. వాడికి కూడా ఈ అడుక్కునే బాధ తప్పుతుంది. ఎక్కడుంటాడో ఏమో తెల్సుకోవాల.


నా మనస్సులో ఒక నిర్ణయం పడింది. వాడిని పలకరించాలన్న కోరిక కలిగింది. పిలిచాను. కానీ ఆ పిలుపు వాడి చెవికెక్కలేదు. వాడి లోకంలో వాడున్నాడు. అయినా వాడికి మాత్రం తెలియదా అడుక్కుతినే వాళ్ళకు ఆప్యాయతను అనురాగాన్ని చిందించే పలకరింపులు ఈలోకంలో అరుదని.

అందుకే మళ్ళీ పిలిచాను.

నా పిలుపు వాడికి అందలేదుకానీ తాను లేచి నన్ను కూర్చోమని సీటు యిచ్చిన పిల్లవాడు గ్రహించాడు.

"ఓరే గుడ్డెబ్బా! సార్ పిలుస్తా వుంటే వినపడలేదంట్రా? చెవుల్లో చెట్లేమైనా మొలిచినాయా? యిటు రాబే" అంటూ వాడిని పురమాయించాడు.

బస్సులో ఒకరిద్దరు "యిట్టుగా దట్రా! ఆ! అట్నే! అట్నే!" అని దారి చూపుతుంటే వాడు తారట్లాడుతూ నడుస్తున్నాడు. "ఆ! అక్కడే! అక్కడే! అక్కడే నిలబడ్రా!" అని యింకొక వ్యక్తి హెచ్చరించేసరికి వాడు నిలబడినాడు. నేను ఎదురుగా వున్నట్టు గ్రహించి నటుంది "దండాలు దేవరా!" అన్నాడు.




"ఏవూరు మీది?"

"సెంద్రగిరి"

"చంద్రగిరిలో ఎక్కడుంటావ్?"

"కాశ్నలో"

"ఈ సినిమా పాటలేనా?..."

"నాటు పాటలు గూడా పాడ్తాను దేవరా!"

"అయితే, ఒక పాట పాడు విందాం."

"తమరెక్కడిదాక పోతావుండారు దేవరా?"

"రంగంపేట జాతరకు!"

"నేను గూడా ఆడికే వస్తావుండాను సామీ! దిగతానే రోడ్డు మలుపులో మర్రిమానొగిటుండాది గదా? ఆ చెట్టుకింద బండమీద కూసోండి. నేనాడికొచ్చేస్తా. ఆడ మీరెన్ని పాటలు పాడమంటే పాడతాను. ఆయరనదాకా ఈ బస్సులో అడుక్కుంటాను దేవరా!"

కనీసం టిక్కట్టు డబ్బయినా గిట్టక పోతే ఎట్లా అన్నట్టుంది వాడి తాపత్రయం.

నేనేమీ అభ్యంతరం చెప్పలేదు.

నా మౌనాన్ని అంగీకారంగా భావించి వాడు మళ్ళీ పాట అందు కున్నాడు. ఇచ్చిన వాళ్ళు యిస్తున్నారు. లేనివాళ్ళు మొగాలు పక్కకు తిప్పేసు కుంటున్నారు. సినిమా పాటను అనుకరించడంలో వాడెంతవరకు కృతకృత్యుడైనాడని నేను గమనిస్తున్నాను. వాక్కులో స్పష్టత వుంది. తాళ జ్ఞానం వుంది. రాగాన్ని చెడగొట్టడం లేదు.

"గుడ్డినాయాలు ఎంత బాగా పాడ్తా వుండాడ్రా?"

బస్సులో ఎవరిదో అభినందన!


"వాడు గుడ్డోడైనా దేముడు గుడ్డోడు కాదు కదా? ఈ లోకంలో బతికేదానికి వాడికీ వొక దోవ సూపించినాడు."

"ఆ! ఆ! ఈడు బొయ్ సూసే సొచ్చినా దబ్బా దేముడు ఈ గుడ్డో డికి బతికేదానికొక దోవ జూపించినాడని! కండ్లీకుండా కంఠం మాత్రం యిచ్చినాడంట. రొండూ యిచ్చుంటే వాడబ్బ గంటేదన్నా పూడిస్తుందా?"

"ఇద్దో! యిట్టా అగుటీలంగా మాట్లాడేకదా కురస్తావుణ్ణె నానలు గూడా కురవకండా బొయ్యింది."

గుడ్డివాడితో ప్రారంభమైన చర్చ గుడిలో దేముడి మీదికి మళ్ళింది. పుర్రెకొక బుద్ధి కదా? తలా తోక లేని వాదనలు వినడానికి తమాషాగా వున్నాయి.

'ఎన్నో వాదనలు విన్నాను. ఏడుపులు




విన్నాను. పోట్లాటలు ఏవి చూసినాను. ఇదంతా అలవాటేగదా? అన్నట్టుగా బస్సు మిట్టపాళెం దాటింది. రైల్వే గేటు దాటింది. కూచివాళ్లపల్లి మర్రిమాను దాటింది. ఇక్కడికి నా బాధ్యత తీరిపోయిందన్నట్టుగా రంగం పేటలో నిలబడింది.

అక్కడ దిగవలసిన వాళ్లకు రెండింతలమంది ఎక్కడానికి సిద్ధంగా వున్నారు.

సాధారణంగా బస్సు ఎక్కేటప్పుడు వుండే తొందర దిగేటప్పుడు వుండదు. దిగవలసినవాళ్లు నిక్కీ నీలిగీ లేస్తుంటే ఎక్కవలసినవాళ్లు ఒక మోపున ఎగబడుతున్నారు. ఫలితంగా దిగవలసిన వాళ్లు దిగలేక ఎక్కవలసినవాళ్లు ఎక్కలేక అక్కడింక యుద్ధం ప్రారంభమయింది.

"ఈ రంగంపేటోళ్లతో వచ్చిన బాదే యిది. బస్సెన్నా సారిపూడస్తా వుండాదా? దిగాల్సినాళ్లు దిగినాక ఎక్కితే మీ యబ్బగంటేమన్నా పూడిస్తుందా? వాళ్ళను దిగనీరు. మీరు ఎక్కలేరు" అని కండక్టర్ విసుక్కుంటున్నాడు.

డ్రైవర్ బస్సు నిలబెట్టి స్థిమితంగా కూర్చున్నాడు. నోట్లో బీడీ పొగ వలయాలు పోతూ వుంది. నిమీలిత నేత్రాలతో పొగ వలయాల్లోని అందాన్ని ఆస్వాదిస్తున్నాడు. అతని ముందర పొగ తాగరాదు బోర్డు సిగ్గుతో ఎరుపెక్కింది.

బస్సు ఎక్కినపుడు పడినంత కష్టం కాకపోయినా యించుమించు అంత ప్రయాసతోనే బస్సు దిగినాను.

రంగంపేట దగ్గర రోడ్డు లంబకోణాకృతిలో వుంది. ఆ లంబకోణం ఏర్పడిన చోట మర్రిమాను. ఆ మర్రిమాను కిందొక నలుపరాతి బండ. వెళ్లి ఆ బండమీద కూర్చున్నాను.

దిగవలసిన వాళ్లను దింపి ఎక్కవలసిన వాళ్లను ఎక్కించుకొని బస్సు భీమవరం వైపు మళ్ళింది.

రంగంపేట జాతర కళతో వెలిగిపోతూ వుంది. సలకలు - సంబల దరువులు మారుమోగిపోతున్నాయి. నా మనసు మాత్రం గుడ్డివాడి పాటమీదనే లగ్నమయింది. వాడికి జరుగబోయే సహాయం మాట దేవుడెరుగును కానీ, వాడు పాడే జానపదాల్లో మంచి పద

జాలం దొరకవచ్చునన్నది స్వార్థం. ఆ బండమీద కూర్చొని వాడి కోసరం ఎదురుచూస్తున్నాను.

వాడు వచ్చినాడు. కప్జీగటి పడుతున్న వేళలో రెండు కండ్లూ లేని కబోది — చేతికఱ్ఱ సాయంతో తారట్లాడుతూ నేను కూర్చున్న బండ దగ్గరికి వచ్చినాడు. సరిగ్గా నా ఎదుట నిలబడినాడు. ఎవరో దారిచూపుతున్నట్టుగా ఎంత చక్కగా రాగలిగి వాడు అని వాడివైపు ఆశ్చర్యంగా చూస్తున్నాను.


"ఉందారా దేవరా?" అన్నాడు.

"కూర్చో!" అన్నాను.

"పరవాలేదులే దేవరా! నిలబడుకోనే పాడతాను. అయితే యిప్పుడు నన్ను నాటు పాటలు పాడ మంటారు."

"అవును."

ఆ మాటతో కూడా ధక్కని అరచేతితో తడిమినాడు. కండ్లకు అద్దుకొన్నాడు. రెండు చేతులు జోడించి నమస్కరించినాడు. రాగాన్ని ఆలపిస్తూ




ధక్కా మీద చేయి పెట్టి వాడు. వ్రేళ్ళు నాట్యం చేస్తూవుంటే నాదం ఎదలో గిలిగింతలు పెడ్తూ వుంది.

చల్లపడేటప్పుడు బావ పగిలిందన్నట్టుగా సరిగ్గా అదే సమయానికి మా వెంగమ్మత్త అక్కడ ప్రత్యక్షమయింది.

వెంగమ్మత్తది రంగంపేట. ఆమె అక్కడ కనిపించేవరకు ఆమెది రంగంపేట అన్న సంగతి నాకు గుర్తులేదు. అదే ఆలోచిస్తూ ఆమెవైపు ఆశ్చర్యంగా చూస్తూ వుంటే —

"జాతర కొచ్చినావా అల్లుడా? అయితే యింటికిడికి రాకుండా ఈ బండమీద కూసున్నావే?" అని దీర్ఘం తీస్తూవుంది.


గుడ్డివాడి ధక్కా వాద్యం ఆగి పోయింది. అది కళాకారుడి లక్షణం. మధ్య ఏ మాత్రం ఆటంకం జరిగినా అతడు సహించలేడు.

వెంగమ్మత్తకు నేనంటే వల్లమాలిన అభిమానం!

వెంగమ్మత్త భర్త కల్యాణిడాంలో చేపలు పట్టుతాడు. ఆ చేపల్ని అమ్ముకోవడానికి వెంగమ్మత్త తిరుపతికి వస్తుంది. దాదాపు రెండేండ్ల కింద ఎప్పుడో వెంగమ్మత్త దగ్గర మా శ్రీమతి చేపలు బేరమాడుతూ వుంది. నేను ఊరికే ఉంటే ఊరా పేరా అన్నట్టుగా "ఏవూరత్తా మద్ది?" అని అడిగినాను.

కాసంత వయసుమళ్లిన వాళ్ళను వరసబెట్టి పిలిస్తే అది వాళ్లకొక బ్రహ్మానందం. ఆ ఆనందంలోనే తొణికిసలాడుతూ వెంగమ్మత్త—

దరణిలో తొండాడ
దాపన ఎలబారి
సెలువైన సెంద్రగిరి
కోటపక్కన దారి
కూచేవాళ్ళపల్లికి
కూత దూరామంది

OUR RUNNING GROUPS

| Name of Group | Chit Value | Instal-ments | Mem-bers | Monthly Instal-ments | Bid Limit | Max. Divedend | Minimum Monthly Instalments |
|---|---|---|---|---|---|---|---|
| CCK | 2,00,000 | 50 | 50 | 4000 | 45% | 1600-00 | 2400-00 |
| CCA | 1,00,000 | 40 | 40 | 2500 | 40% | 875-00 | 1625-00 |
| CCB | 50,000 | 40 | 40 | 1250 | 40% | 437-50 | 812-50 |
| CCD | 25,000 | 40 | 40 | 625 | 40% | 218-75 | 406-25 |
| CCB | 50,000 | 25 | 25 | 2000 | 30% | 500-00 | 1500-00 |
| CCD | 25000 | 25 | 25 | 1000 | 30% | 250-00 | 750-00 |

పాఠకులకు, సభ్యులకు
శ్రేయోభిలాషులకు
మా దీపావళి శుభాకాంక్షలు!

**మీరు ఆశించే**
**ప్రయోజనాల కోసం**
**చనుమోలు చిట్ ఫండ్స్**
**ఉంటుంది**
**అండగా మీకు నిరంతరం!**

TEJAPUBS

**చనుమోలు**
**చిట్ ఫండ్స్ (ప్రై) లిమిటెడ్**

27-14-57, చనుమోలు కాంప్లెక్స్, రాజగోపాలాచారి వీధి
గవర్నర్ పేట, విజయవాడ-2
ఫోన్స్: ఆఫీసు: 64757, 76661, రెసి: 52729.

Bomma

పేటంటే పేటరా! అల్లుడా!
దానిపేరే రంగంపేటరా!
—అని ఏకంగా ఒక ఏల పదమే పాడింది.

"అమ్మో! అసాధ్యురాలుగా వుందావే?" అంటే" ఈ గడవని బతుకుల్లో గడప గడపకొక మాట! గంప దించిన సోటొక మాట గదా అల్లుడా!" అనింది.

అద్దో! అప్పటి నుండే వెంగమ్మత్త గంప నెత్తిన బెట్టుకుని తిరుపతిలో ఏ వీథిలో కనుపించినా"ఏ మత్తో!" అంటే ముసిముసి నవ్వులు నవ్వుతూ "బాగుందావా అల్లుడా?" అని అడిగేది.

ఆ వేళ అనుకోకుండా అక్కడ ఆమె ప్రత్యక్షమయ్యేసరికి స్మృతి పథంలో గతం తలుక్కున మెరిసింది.

"నన్నింక పాడమంటారా దేవరా?"
గుడ్డివాడు అడుగుతున్నాడు.
"ఈణ్ణి యాడపట్టిని అల్లుడా?"
"బస్సులో నస్తా వుంటే పాటలు పాడుకొంటూ అడుక్కుంటున్నాడు. రెండు పాటలు విందామని..."

"పాటలు పాడ్తే ఇందా వనుకున్నావ్. బాగానే వుండాది. అయితే అట్టబోయి సూడుబో ఆసె అవసోసాలు పడ్తా వుండేది"

"ఎవరత్తా?"


"ఎవురో ఒకరు. వాణ్ణి ఈడ నిల బెట్టేసి దాని సాసమెందుకు బోసుకుంటావ్. ఒరె గుడ్డెబ్బా! నువ్వు ముందుగా కొంప కాడికి బోయ్ అట్టా ఎలుగిచ్చేసి మల్లాగావాలంటే రారా! వొచ్చి నీకొచ్చినన్ని పాటలు పాడు. అప్పుడు గావాలంటే అల్లుడు తీరిగ్గా సూసోని యిన్నెంతసేపు యింటాడు"

"అది గూడా నిజవే దేవరా! ఇద్దో ఈడున్నట్టే వస్తాండస్తి!"

అంటూ గుడ్డివాడు నా మాట కోసరం కూడా ఎదురుచూడకుండా ఆ కట్టిగటిలో చేతిక(ర్రతో దారి వెతుక్కొంటూ ఇంటివైపు నడుస్తున్నాడు.

"అవసోసాలు పడే ఆసె ఎవరత్తా?'
"ఇంకెవురు? వాడి సకురాలు!"
"వాడికి సఖురాలా?"

"వాడంటే? వాడేం మణిసి గాదా? మొగోడు గాదా? అయినా ఆ సిన్నది ఎటువంటిది? సూడ సక్కని సిన్నదే? బెమ్మదేముడు కోరికోరి సేసిన కుంద నంపు బొమ్మే! వాడి పాట యినే, ఊల్లో సదిమంది కాదు గీదంటే అవునంటే అవునని, 'ఏరికోరి గుడ్డోడి సేలికి




సెయ్యిచ్చె. ఊరూవాడు కోడై కూస్తా వుంటే కుశాలగ వాణ్ణే ఎంటబెట్టుకుని తిరిగె. అటువంటిది దేముడు ఓర్వకుండా సాయ. దానికి పెద్దమ్మోరొచ్చె. ఆ గంగమ్మతల్లి సోతా సోతా రెండు కండ్లూ తీసుకుని సాయ"

"అయ్యో పాపం!"

"అయినా దాని సొసరం ఏమని సెప్పమంటావ్ అల్లుడా? పలానా దినం పలానా యాలకొస్తా నన్నాడంటే సోయ్ సామకో. ఇంట్లోకీ ఈదిలోకీ ఈదిలోకీ ఇంట్లోకీ ఒక్క మోసన తిరగతా వుంటేంది. వాడి అడుగుల సడి ఎట్ట పసిగట్టేందో పసిగట్టేంది. అల్లంత దూరా నుండగానే 'మావా!' అని ఎలుగిస్తేంది. తప్పే దారి గెంటో అరగెంటో ఆలీశం అయ్యిందనుకో! గొణుక్కుంటూ సణుక్కుంటూ అది పడే యాదనుండా దేటి ఎందుకు సెప్తావులే?"

ప్రేమ గుడ్డిది అంటారు. అయితే ఆ ఇద్దరి గుడ్డివాళ్ళ మధ్య ప్రేమకు మాపు వచ్చింది. ఆ ఇద్దరి అనుబంధం

వింటూ వుంటే గొంతులోని మాధుర్యానికి మనసిచ్చిన ఆ చిన్నదాన్ని చూడా లన్న కోర్కె కలుగుతూ వుంది.

అంతలోనే "అయ్యో! అమ్మో!" అన్న కేకలు వినిపించినాయి.

దృష్టి అటువైపు మళ్ళింది.

నేను కూర్చున్న నలుప రాతి బండకు ఎదురుగా రోడ్డుకు అవలి వైపున ఒక గుడిసె. గుడిసెముందర సాతికేండ్ల పడుచు పిల్ల. ఆమే అరుస్తూంది. ఒకడు ఆమె జుట్టుపట్టి వంగదీసి పిడి గుద్దులు గుద్దుతున్నాడు.

ఆమెవోరాడుతూ వుంది.

వాడి చెయ్యి ఆడుతూ వుంది.

అయ్యో! అమ్మో! అని అరుస్తానే ఆమె నోటికొచ్చినట్టు బండ బూతులు తిడుతూ వుంది. ఆమె తిట్టే కొద్దీకీ వాడు రెచ్చిపోతూ చావు గుద్దులు గుద్దుతున్నాడు.

"అయ్యయ్యో! పాపిష్టి ముండా కొడుకు. ఆడదానిమీద అట్లా చేయి చేసుకుంటా వుండాడే? అంత మంది చుట్టూ చేరి వేడుక చూస్తున్నారే. ఒక్క

రన్నా జోక్యం చేసుకోవచ్చు గదా?

"నీకు తెల్దులే అల్లుడా? దానికా శాస్తి జరగాల్సిందే!

"ఆడ పుట్టుక పుట్టి నువ్వు గూడా ఆ మాటంటావా అత్తా?"

"సోసి! నువ్వే జెప్ప నాయంఅల్లుడా! అదొక మొగుడొదిలేసిన ముండ. ఎందు కొదిలేసినాడో? ఏం సాడో? ఆ పాపం పున్నెం బగమంతుడికే ఎరిక. మొగుడొదిల్న ముండ మొబ్బిడిసిన ఎండ రొండూ నొగిలేనంటారు. ఆ ముండ వచ్చి తల్లిసాటన సేరింది. సేరిన కొన్నాళ్ళకే ఎవుణ్ణో ఒకణ్ణి తగులుకుంది. సోసిలే వయసులో వుండేది గదా అని ఇక్కడ పక్క వోళ్ళు సూసీ సూడకుండా సోతూ వున్రు(డి. పాపం వాడు గూడా ఇంటిగ్గావాల్సిన నుప్పైనూడు, అరవై అరు తెచ్చేస్తా వుండాడు. వాడీ సొద్దు జాతరకని నొస్తే అది ఇంకొకడి పక్కన పడుకోనుంటే-దాన్నేం జేస్తే తీరు?"

"ఆ గుడ్డిదే మేలుగా వుందే?"

"సిన్నంగంటావా ఆ మాట? అల్లుడా! నీకు తెలవన్దేముండాది?-ఈ లోకంలో ఎన్నో ఇంతలు జరగతా వుండాయి. ఇనోదాలుజరగతావుండాయి. ఎంత మంది అందగాళ్ళు పుట్టారో? పుట్టబోతారో? ఆ గుడ్డిదానికేవన్నా కాబట్టాయా? దానికి ఎరికయ్యింది...గుర్తుందేది ఆ గుడ్డోడి రూపమే గదా? అందుకే దాని మణుసు నిండా వాడే! "ఈడ కత అట్టా కాకపాయెనే
"అంటే?"

"దీనికి కండ్లుండాయి గద అల్లుడా? పాడు కండ్లు! సూసిందంతా కావాలంటాయ్!"

చేపలమ్ముకొనే వెంగమ్మత్త చెప్పింది కొత్త సత్యాన్ని!

నదజాలం కోసరం వెళ్ళితే కొత్త సత్యాన్ని తెలుసుకొన్న తృప్తి!!

ఆ గుడ్డి దంపతులు నా మనసు నంతా ఆవరించుకొన్నారు.

కండ్లున్న గుడ్డివాళ్ళ మానసిక దార్బల్యాలు, దౌష్ట్యాలు సంస్కార వర్గానికి ప్రతి నిధిగా నిలబడిన వారెండు కండ్లను బాకులై పొడుస్తుంటే వంచిన తలెత్తలేక పోయినాను!*

